క్లుప్తంగా

క్షయ వ్యాధి రాకుండా టీకాలు వేసుకోండి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రవిరాజు

నింద్ర: క్షయ వ్యాధి రాకుండా టీకాలు వేసుకోవాలని జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారి రవిరాజు తెలిపారు. ఆయన శుక్రవారం చవరంబాకం, అరూరు, సచివాలయాల వద్ద జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారు అందరూ క్షయ వ్యాధి రాకుండా బీసీజీ టీకాలు వేయించుకోవాలన్నారు. ప్రతి గురువారం సచివాలయంలో టీకాలు వేసే కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సిహెచ్‌వో శ్రీదేవి, పర్యవేక్షకులు సురేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న శ్రీరాములు కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతలు అన్నదానం చేశారు. వై.శ్రీరాములు మొదటి వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు భార్య వై.రాజేశ్వరి, కుమారుడు నవీన్, కుమార్తెలు లోకి, హర్ష పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

శ్రీరంగరాజుపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఐఓ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత బీసీజీ వ్యాక్సిన్, రొటీన్ వ్యాక్సినేషన్‌పై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి వచ్చిన రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్ రాజ్, గిరీ, మునస్వామి పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో మోస్తరు వర్షం

వెదురుకుప్పం: మండలంలోని శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట ప్రాంతాల్లో వర్షం పడింది. ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వర్షంతో కాస్త ఉపశమనం లభించింది.

20న ప్రదోష పూజలు

వెదురుకుప్పం: డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో 20వ తేదీ సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించనున్నట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

పాశాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని, సంతానం లేని వారికి ఉచిత కన్సల్టేషన్‌తోపాటు స్కానింగ్, వీర్య పరీక్ష ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఐయూఐ, ఐవీఎఫ్ పరీక్షలపై 50 శాతం రాయితీ ఉన్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని స్థానికులతోపాటు చుట్టు పక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయం, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోనే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడే వారు ఆధార్‌కార్డుతో హాజరవ్వాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు.

వేసవిలో పెరుగుతున్న లోడ్

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో విద్యుత్ పరికరాల వాడకం పెరగడంతో లోడ్ పెరుగుతోందని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. గృహాల్లో ఎక్కువగా ఏసీ, ఎయిర్ కూలర్లు, వాణిజ్య, పరిశ్రమల్లో యంత్రాలు, పరికరాల వాడకం పెరగడంతో లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. వాటిని సకాలంలో మార్పు చేస్తున్నామన్నారు. ఏప్రిల్‌లో త్రీ ఫ్యూజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 110, సింగిల్ ఫేజ్‌వి 8, మే నెలలో ఇప్పటి వరకు త్రీ ఫ్యూజ్ 69, సింగల్ ఫ్యూజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 13 మరమ్మతులకు గురైనట్లు చెప్పారు. గ్రామాల్లోనూ వాడకం పెరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సకాలంలో లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వివరించారు.

ఆర్బీకేలకు సబ్సిడీ వేరుశనగ

ఐరాల: మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు సరఫరా చేసినట్లు ఏఓ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండలానికి 1,710 క్వింటాళ్లు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు కేటాయించారని, అందులో భాగంగా 500 క్వింటాళ్ల వేరుశనగ కాయలు వచ్చినట్లు చెప్పారు. రైతులకు సకాలంలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు.

తపస్సు మాను పైనుంచి వేసిన పూలు, నిమ్మకాయలు పట్టుకుంటున్న భక్తులు



వేడుకగా అర్జున తపస్మాన్



తపస్సు మాను ఎక్కుతున్న అర్జున వేషధారి

పాలసముద్రం : మండలంలోని అలిమేలుమంగాపురంలో ఉన్న ద్రౌపదీదేవి ఆలయంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. వేణుగోపాల నాట్యమండలి కళాకారుడు, శ్రీరంగరాజుపురం మండలం మెదవాడ గ్రామం భాస్కర్ అర్జున వేషధారణలో మెట్టు మెట్టుకు పద్యాలు ఆలపిస్తూ, పరమ శివుడిని వేడుకుంటూ తపస్సు మానును అధిరోహించాడు. అక్కడి నుంచి తపస్సు మాను వద్ద వరపడి సంతానం లేని మహిళలపై నిమ్మపండ్లు, విభూది పండ్లు, పూలు చల్లాడు. వాటి కోసం భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. అంతకు ముందు ద్రౌపదీ మాన సంరక్షణ హరికథా గానం భక్తులను అలరించింది. ఈ ఏడాది మండలంతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణలో రద్దీ నెలకొంది.

తాగునీటి సమస్య పరిష్కారం బాధ్యత కార్యదర్శులదే



మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీపీ లత అన్నారు. వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీడీవో మోహన్‌మురళీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లత మాట్లాడుతూ తాగునీటి సమస్యలున్న గ్రామాలను విధిగా గుర్తించి, పరిష్కరించాల్సిన బాధ్యత కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉందన్నారు. అధికారులు కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ మోహన్‌మురళీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం కొత్త విధాన నిర్ణయాలు, ప్రకటనలు, తీర్మానాలు చేయకూడదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను నూతన పనులకు వెచ్చించకుండా, గ్రామాల్లో అవసరమైన తాగునీటి పథకాల మరమ్మతులు, పైపులైన్లు, ట్యాంకుల మరమ్మతులకు మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. కొటార్వేడు పంచాయతీలో తాగునీటి సమస్య ఉందని ఎంపీటీసీ సభ్యురాలు విమల అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పద్మసరస్సు ఎస్సీ కాలనీలో కూడా తాగు నీటి సమస్యతో పాటు విద్యుత్ సమస్య ఉందని, అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యులరాలు కమ్మలమ్మ అధికారులకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మోహన్‌మురళీ ఆయా పంచాయతీ కార్యదర్శులు గ్రామాలను సందర్శించి, సమస్యను పరిష్కరించి వెంటనే తమకు నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, ఎంఈఓ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ నీలావతి, ఏఈలు ప్రకాష్, గిరీషం, హేమాద్రి, ఏఓ హేమలత, మండల కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మణెమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో ద్రౌపదీదేవి

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఓంశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పంబవాయిద్యాల నడుమ పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు



విశేషాలంకరణలో ఓంశక్తి అమ్మవారు

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురంలో ఉన్న ఓం శక్తి ఆలయంలో అమ్మవారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గురుస్వామి అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి ఓం శక్తి భక్తులు పంబవాయిద్యాల నడుమ కొత్త కుండల్లో పొంగళ్ల సామగ్రితో అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకుని, మూడు సార్లు ఆలయ ప్రదక్షిణ చేసి, పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, కర్పూరహారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పూజలకు పాల్గొన్న భక్తులకు పంచామృతం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా ఉత్తర నక్షత్ర పూజలు



ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నగరి : మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ కూడలి వద్ద ఉన్న అయ్యప్ప ఆలయంలో శుక్రవారం అయ్యప్ప జన్మ నక్షత్రం సందర్భంగా ఉత్తర నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అయ్యప్పస్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వాసు, పుష్పలత, పార్వతి వనజ, బాలకృష్ణ, భానుమతి, హేమ ప్రత్యూష్, దిలీప్‌కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మురళి, కన్నప్ప, రమేష్‌బాబు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇరుగు పొరుగు

హంస వాహనంపై గోవిందుని వైభవం



సరస్వతిగా హంస వాహనంపై ఊరేగుతున్న గోవిందరాజస్వామి



చిన్న శేష వాహనంపై ఊరేగుతూ దర్శనమిస్తున్న శ్రీగోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: గోవిందరాజ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి స్వామివారు సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై కొలువై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటల స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది. వాహనం ముందు వృషభాలు, అశ్వాలు, గజరాజులు నడుస్తుండగా భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికి స్వామివారిని దర్శించుకున్నారు. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి చిన్నశేష వాహన సేవ వేడుకగా సాగింది. వాహన సేవలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో స్వామివారిని కీర్తించారు. అనంతరం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, భక్తులు పాల్గొన్నారు.







స్వామివారి వాహన సేవలో చెక్కభజనలు, కోలాటాలతో ఆకట్టుకుంటున్న కళాకారులు

గంగమ్మకు సారె



గంగమ్మకు సారె తీసుకువస్తున్న కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: గంగ జాతర సందర్భంగా నగరంలోని 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మకు సాంప్రదాయ సారెను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. 11వ డివిజన్‌లోని కార్పొరేటర్ నివాసంలో అమ్మవారి సారెకు పూజలు నిర్వహించి అక్కడి నుంచి డప్పులు, దరువులతో గంగమ్మ ఆలయానికి ఊరేగింపుగా విచ్చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరను పురస్కరించుకొని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ వేర్వేరుగా ఆలయానికి విచ్చేసి శ్రీతాతయ్యగుంట గంగమ్మని దర్శించుకొని పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.



గంగమ్మను దర్శించుకుంటున్న నగర మేయర్ డాక్టర్ శిరీష



గంగమ్మ సేవలో డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి రూరల్, అవిలాల, ధనలక్ష్మి నగర్‌కు చెంది, స్థానిక ఎస్పీ ఆఫీసులో ఉద్యోగిగా ఉన్న షేక్ మహమ్మద్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది పులికొండ బాలాజీ తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతి, జీవకోన, అరుణోదయ నగర్‌కు చెందిన బి.రామమూర్తి వద్ద మహమ్మద్ అలీ 2020 సెప్టెంబర్ 10వ తేదీన 10 లక్షల రూపాయలను అప్పుగా తీసుకొని ప్రోనోటు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అతను 2021 సెప్టెంబర్ 23వ తేదీన రామమూర్తికి ఓ చెక్కును ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో అతను షేక్ మహమ్మద్ అలీపై కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించి షేక్ మహమ్మద్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే పది లక్షల రూపాయల చెక్కు సొమ్మును పరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

వ్యాయామంతో రక్తపోటుకు చెక్



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామంతో రక్తపోటు సమస్య ను అధిగమించవచ్చు అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుపతి రుయా నుండి ఎస్వీ మెడికల్ కళాశాల కూడలి వరకు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడంపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. 40 ఏళ్లు పైబడిన వారికి ఆహారపు అలవాట్లలో సమూల మార్పులు అవసరమని చెప్పారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించాలంటే అందుకు సరైన ఆహారం తీసుకోవడం తప్పనిసరి అన్నారు. వైద్యుల సూచనల మేరకు ప్రతి ఒక్కరు జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు శారీరక వ్యాయామం అవసరం అన్నారు. వైద్యాధికారులు డాక్టర్ హరికృష్ణ , డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది లావణ్య, పద్మావతి, రూపకుమార్, ఇతర వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కృష్ణస్వామిరాజుకు దేవమ్మ బాలల కథా పురస్కారం

తిరుపతి కల్చరల్: ఆర్‌సీ కృష్ణస్వామిరాజు రచించిన కార్వేటినగరం కథలు పుస్తకానికి పలమనేరు శివేగారి దేవమ్మ బాలల కథా పురస్కారం లభించింది. ఈ మేరకు బాలసాహిత్యాన్ని ప్రోత్సహించాలన్న సంకల్పంతో ప్రతి ఏటా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకుడు కేవీ మేఘనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ పుస్తకంలోని కథలన్నీ భిన్న నేపథ్యాలతో, చక్కటి కొసమెరుపులతో, పిల్లల్ని ఆకర్షించే బొమ్మలతో నిండి ఉన్నాయి. తిరుపతికి చెందిన రచయిత ఆర్‌సీ కృష్ణస్వామి రాజు ఇప్పటికే 150 పిల్లల కథలు రాశారు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన ఈ కథలన్నింటినీ రచయిత రాజుగారి కథలు, రాణి గారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు అనే నాలుగు సంపుటాలుగా వెలువరించారు. వీటిలోని చాలా కథలు ఆలిండియా రేడియోలో పిల్లల కార్యక్రమంలో ప్రసారమయ్యాయి. ఈ పుస్తకంలోని అనేక కథల్లో పాత చిత్తూరు జిల్లా ప్రాంతాలు, విశేషాలు, చరిత్ర నేపథ్యాలు జానపద విశేషాలు విరివిగా కనిపిస్తాయి. ఈ కథా సంపుటాల పోటీకి న్యాయ నిర్ణేతలుగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డీకే.చదువుల బాబు, బాలసాహిత్య పరిషత్ కోశాధికారి పైడి మర్రి రామకృష్ణ వ్యవహరించారు.

శేషాచలంపై మంచు తెరలు



అసలే మండుతున్న ఎండలకు జనం అల్లాడిపోతున్న విషయం తెలిసిందే. ప్రజలకు కాసింత ఊరట కలిగేలా నగరంలో మోస్తరుగా చిరుజల్లులు కురిశాయి. అదే క్రమంలో శేషాచలంపై మంచు తెరలు కమ్ముకున్నాయి. తిరుపతి గంగజాతర కావడంతో ఇలా నగరంలో చల్లటి వాతావరణం ఏర్పడడం సాధారణమే.



- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి